క్లుప్తంగా

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



పాలమూరు: రిలయన్స్ ట్రెండ్స్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పదోతరగతి పరీక్షలో ప్రతిభ చాటిన 45 మంది శ్రీ ప్రతిభా హైస్కూల్ విద్యార్థులకు శనివారం ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందజేశారు. విద్యార్థులు బాగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే ఉద్దేశంతో రిలయన్స్ ట్రెండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ట్రెండ్స్ క్లస్టర్ మేనేజర్ రంజిత్, ఎస్‌ఎం సుధీర్ శర్మ, డీఎం జగదీష్‌తోపాటు శ్రీప్రతిభ స్కూల్ ప్రిన్సిపాల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట 9వ వార్డులోని డంపింగ్‌యార్డుకు చెత్త తీసుకువెళ్లే వాహనాలకోసం హిటాచి సహాయంతో చేస్తున్న రోడ్డు పనులను శనివారం చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి పరిశీలించారు. వార్డులో ఉన్న డంపింగ్ యార్డులో చెత్తపేరుకుపోవటంతో ఆ చెత్త గాలికి సమీపంలోని పంట పొలాల్లోకి వెళ్తుండటాన్ని రైతులు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే చెత్త రైతుల పొలాలకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్‌ను ఆదేశించటంతో పనులు చేపట్టారు. సమీపంలోని ప్రభుత్వ స్థలంలో చెత్త వేయాలని నిర్ణయించారు. అందుకు చెత్త వాహనాలు వెళ్లేందుకు రోడ్డు ఫార్మేషన్ చేయించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బుక్క మహేష్ పాల్గొన్నారు.

తెలంగాణ రన్‌ను విజయవంతం చేయాలి

అడ్డాకుల: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 12న అడ్డాకులలో నియోజకవర్గానికి సంబంధించిన తెలంగాణ రన్‌ను నిర్వహించనున్నట్లు ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో సమీక్ష నిర్వహించారు. అన్ని గ్రామాల్లోని యువకులు రన్‌లో పాల్గొనేలా నాయకులు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మాధవరెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ రంగన్న, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, కోఆప్షన్ ఖాజాఘోరీ, చంద్రమోహన్‌రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సేవారత్న పురస్కారం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రం సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీ లక్ష్మీనారాయణ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మణి ఆనంద్‌కుమార్ భారత ఉత్తమ సేవా రత్న పురస్కారం అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని లింగంపల్లిలో హోలీ ప్రిన్స్ విద్యావైద్య ఆధ్యాత్మిక సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేశారు. ఆ సంస్థ చైర్మన్ ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల సాధన దీక్షలో పూర్వ విద్యార్థులు

నారాయణపేట రూరల్ : కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరహారదీక్షలు 32వ రోజుకు చేరుకున్నాయి. గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007–08 విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుకున్న విద్యార్థులు శనివారం దీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీవైఎల్ నాయకులు కాశీనాథ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చొరవ తీసుకుని కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, ప్రవీణ్, బాలప్ప, నర్సింహులు, వెంకట్రాములు, లక్ష్మారెడ్డి, సలీం, హన్మంతు, తిరుపతి పాల్గొన్నారు.

వైద్య విజ్ఞాన సదస్సు

నారాయణపేట రూరల్ : స్థానిక సత్యనారాయణస్వామి ఆలయం వద్ద శనివారం వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యూరో వైద్యులు డాక్టర్ జీవీకే రెడ్డి, జీవీహెచ్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చారు. దీర్ఘ కాలిక వ్యాధులు, న్యూరో, పక్షవాతం, బ్రెయిన్‌స్ట్రోక్, వెన్నునొప్పి, మెడ నొప్పిలకు సంబంధించిన పలు విషయాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో నర్సింగ్, జమీర్‌పాషా, చింతలయ్య, గోపాల్, వెంకట్రాములు, ఖాసీం, సబిత, నాగమణి, మంజుల పాల్గొన్నారు.

సమష్టి కృషితో రాజ్యాధికారం

నారాయణపేట రూరల్ : బీజేపీ కార్యకర్తలు, అన్ని మోర్చాల ప్రతినిధులు సమష్టిగా కృషి చేస్తే రాబోవు ఎన్నికల్లో తెలంగాణలో కమల వికాసం ఖాయమని ఆ పార్టీ దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా అన్నారు. పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వివిధ మోర్చాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, ప్రజల నడ్డి విరుస్తూ అన్ని రకాల పన్నుల ధరలను పెంచి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు, జీకే నర్సింహులు, ప్రభాకరవర్ధన్, గోవర్ధన్‌గౌడ్, విజయ్, నర్సింగ్‌నాయక్, లక్ష్మి పాల్గొన్నారు.

వెంటాడుతున్న 'నకిలీ' భయం

- రైతుల్లో ఆందోళన పెంచుతున్న విత్తనాల నాణ్యత



గతంలో మండల పరిధిలోని కొల్లూర్‌లో పట్టు బడ్డ నకిలి విత్తనాలు.(ఫైల్)

నవాబుపేట: రైతులు సాగుకు సమాయత్తం అవుతున్న తరుణంలో మండలంలో నకిలీ విత్తనాల భయం రైతులను వెంటాడుతోంది. రెండేళ్ల క్రితం మండల పరిధిలోని కొల్లూర్ గ్రామ సమీపంలో వ్యవసాయ పొలంలో పెద్ద ఎత్తున నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. కేవలం ఒకే గ్రామంలో దాదాపుగా 6 వందల ప్యాకెట్లు నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. వీటి అంచనా దాదాపు రూ.4 లక్షలు. కాగా మండలవ్యాప్తంగా అప్పట్లో నకిలీ విత్తనాలపై ఎంతో చర్చసాగింది. తాజాగా సైతం రైతులు సాగుకు అన్ని సిద్ధం చేస్తున్న తరుణంలో సాగుకు ఉపయోగించే విత్తనాల నాణ్యత, నకిలీ భయం ఆందోళన రేకెత్తిస్తోంది. ప్రధానంగా మండల సరిహద్దు రంగారెడ్డి జిల్లాకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో పెద్ద ఎత్తున పత్తి సాగు చేస్తారు. దీంతో అక్కడే నకిలీ విత్తనాలు ఎక్కువ మొత్తంలో రైతులకు చేరుతుంటాయి. దీంతో పత్తి విత్తనాల విషయంలో రైతులకు ఆందోళన కలుగుతోంది. రైతులకు నకిలీ విత్తనాలపై సరైన అవగాహన లేకపోవటం కూడా సవాల్‌గా మారుతోంది. గతంలో చాలా చోట్ల వరి విత్తనాలు సరిగ్గా మొలకెత్తని ఘటనలు ఆలోచింపచేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రైతులకు నకిలీ విత్తనాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, వారికి నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

అవగాహన కల్పించాలి..

పంటలు సాగు చేసే విషయంలో రైతులకు వ్యవసాయ అధికారులు సూచనలు చేయాలి. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. మరీ ముఖ్యంగా విత్తనాల నాణ్యత, నకిలీకి ఆస్కారమిచ్చే అంశాలపై వివరించాలి. అదేవిధంగా ఎవరైనా నకిలీ విత్తనాలు రైతులకు అమ్మడానికి ప్రయత్నిస్తే కఠినచర్యలు తీసుకోవాలి.

– రాములు, పోమాల్

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..



నకిలీ విత్తనాలను నియంత్రించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గతంలో ఇతర ప్రాంతాల నుంచి కొందరు నకిలీ విత్తనాలు తీసుకుని వచ్చి రైతులకు తక్కువ ధర పేరుతో అంటగట్టేందుకు ప్రయత్నం చేశారు. దీంతో వారిని పట్టుకుని విత్తనాలు సీజ్ చేశాం. నాటి నుంచి చాలా వరకు మండలంలో నకిలీ విత్తనాల జాడ కన్పించకుండా చర్యలు తీసుకున్నాం. తరచూ విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నాం. పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఎవరైనా నకిలీ విత్తనాలు రైతులకు విక్రయించినట్లు తేలితే కచ్చితంగా కఠినచర్యలు తీసుకుంటాం.

– కృష్ణకిషోర్, మండల వ్యవసాయ అధికారి, నవాబుపేట

ప్రత్యేక రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి



రాజాపూర్‌లో దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లను అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

రాజాపూర్: ఉద్యమాలు, పోరాటాలతో సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి సాధించామని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సుపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యంగా ఉమ్మడి బాలానగర్ మండలం నుంచి కొత్తగా రాజాపూర్ మండలాన్ని అడగకముందే ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి చొరవతో ఏర్పాటు చేశారని అన్నారు. రాజాపూర్ మండలం ఏర్పాటు కావడంతో పరిపాలన సౌలభ్యం పెరిగిందన్నారు. అనంతరం సుపరిపాలన దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లను అందజేశారు. ఎంపీపీ సుశీల, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కొప్పెరిబచ్చిరెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీదేవి, నాయకులు ఆనంద్‌గౌడ్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఎంతో వెనుకబడిన తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని వైస్ ఎంపీపీ ఈశ్వర్‌గౌడ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొత్తజిల్లాలు, మండలాలు, గ్రామాలు ఏర్పాటు చేసి పరిపాలనను ప్రజలకు మరింత దగ్గర చేశారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడాలేని పథకాలను ప్రవేశపెట్టారని వివరించారు. ముఖ్యంగా వ్యవసాయానికి సాగునీరు, కొత్త ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటివి ఎన్నో అమలు చేశారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, తెలంగాణ ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.



మహమ్మదాబాద్‌లో మాట్లాడుతున్న వైస్‌ఎంపీపీ ఈశ్వర్ గౌడ్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



అడ్డాకులలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: దివ్యాంగులకు పింఛన్ రూ.3,116నుంచి రూ.4,116లకు పెంచటాన్ని హర్షిస్తూ శనివారం మున్సిపాలిటీ పరిధిలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. లాలు, హుసేన్‌బీ దంపతులు, చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, వార్డు కౌన్సిలర్ సతీష్ పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, దివ్యాంగులు కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో కార్యక్రమం నిర్వహించారు. మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

హన్వాడ: దివ్యాంగులకు రూ.4116ల ఫించన్‌ను ప్రకటించిన నేపథ్యంలో శనివారం సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవ్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ బాల్‌రాజు ప్రభుత్వం చేస్తున్న కృషిని కొనియాడారు. మండల బీఆర్‌ఎస్ నాయకులు రమణారెడ్డి, మాధవులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో..

హన్వాడ: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కృషి అమోఘమని బీసీ మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్ ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంలో ఆరెకటికల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయాన్ని ప్రకటించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, రమేష్, రవీందర్, బాలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: బీసీలకు కులవృత్తులవారికి రూ.లక్ష ఆర్థికసాయం అందించడంపై ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, మహేందర్, శ్రీనివాస్, భీమాజీ, రాజు తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి చెందిన ఓపాల బాలన్న భార్య వెంకటమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని శనివారం బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు వేర్వేరుగా పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.రాజశేఖర్‌రెడ్డి రూ.10వేలను పంపడంతో బీఆర్‌ఎస్ నాయకులు వాటిని మృతురాలి భర్త బాలన్నకు అందజేశారు. అదేవిధంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ బాధిత కుటుంబానికి రూ.5వేలను అందజేసి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీకాంత్, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ శంకర్ తదితరులు ఉన్నారు.

యోగేంద్రజీకి నివాళులు



జడ్చర్ల టౌన్: జాతీయ సంస్కారభారతి వ్యవస్థాపకుడు యోగేంద్రజీ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలో ఘన నివాళి అర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు గోనెల రాధాకృష్ణ, బాలమణి, సుమతి, మౌనిక, దీక్షిత, హరిప్రియలు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

మిడ్జిల్: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 12న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా సన్నాక సమావేశానికి హాజరవుతున్నట్లు కన్వీనర్ జంగయ్య తెలిపారు. సమావేశం కరపత్రాలను శనివారం విడుదల చేశారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు బాలయ్య, వెంకట్, రాములు తదితరులు పాల్గొన్నారు.

140వ రోజుకు చేరిన రిలే దీక్షలు

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలేదీక్షలు శనివారం 140వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన యువకులు రిలేదీక్షలో పాల్గొని మద్దతు పలికారు. ప్రభుత్వం స్పందించి పాలనా సౌలభ్యం కోసం గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రిలేదీక్షలో మండలసాధన సమితి కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి, ఆయా గ్రామాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

సోనామసూరి ధర రూ.2,241

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,241, కనిష్టంగా రూ.2,201గా నమోదయ్యాయి. ప్రస్తుతం సీజన్ ముగియడంతో మార్కెట్‌కు ధాన్యం రాక తగ్గింది.

హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న నాయకులు

జడ్చర్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారని బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుబాష ఆరోపించారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడెకరాల భూమి ఇస్తామని మోసం చేశారని అన్నారు. దళితబంధు ఇచ్చి ఎమ్మెల్యేల ద్వారా కమీషన్లు తీసుకున్నారని పేర్కొన్నారు. దళితులను ఓటు బ్యాంక్‌గానే వాడుకుంటున్నారని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుడు కొంగళి శ్రీకాంత్, అధికార ప్రతినిధి హరిబాబు, పట్టణ అధ్యక్షుడు సామల నాగరాజు, కౌన్సిలర్ రాజుపాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 9వ వార్డు పరిధిలోని పాలకొండలో శనివారం అభయాంజనేయ భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో 84 మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని వైద్యులు రక్తపరీక్షలు, ఈసీజీ, మూత్ర పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ మూషా నరేందర్, సంఘం అధ్యక్షుడు కె.నాగరాజు, ప్రధాన కార్యదర్శి డి.ఆంజనేయులు, కోశాధికారి పి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌ఆర్‌ఆర్'కు దాతల సహకారం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో మున్సిపల్ సిబ్బంది ప్రతి శనివారం 'పునరాలోచన రోజు'ను పాటిస్తున్నారు. ఇందులో భాగంగా రెడ్యూస్–రీయూజ్– రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) పై పట్టణంలో ప్రత్యేక వాహనం ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. తాజాగా శనివారం 18, 38వ వార్డులలో మహిళా సంఘాల ప్రతినిధులు ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా కొందరు దాతలు పాత దుస్తులు, ఇతర వస్తువులు అందజేశారు.



న్యూప్రేమ్‌నగర్‌లో దుస్తులు అందజేస్తున్న దాత

ద్విచక్రవాహనాలు ఢీ : ముగ్గురికి తీవ్రగాయాలు



క్షతగాత్రులతో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మహమ్మదాబాద్: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీ కొని ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామానికి చెందిన బాలయ్య, బాలు నంచర్లగేట్ వైపు నుంచి కుల్కచర్ల వైపు వెళ్తున్నారు. అదేసమయంలో కర్ణాటక నాందేడ్‌కు చెందిన ఓ వ్యక్తి మద్యం సేవించి ఎదురుగా వస్తూ అతివేగంతో వారి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌లపై ఉన్నవారు తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో ఓషాపు ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి అక్కడే ఉన్నారు. వెంటనే స్పందించి రోడ్డుపైకి వెళ్లి 108 అంబులెన్సుకు ఫోన్ చేసి క్షతగాత్రులను వెంటనే మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. కాగా నాందేడ్ వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు 108 సిబ్బంది ఈఎమ్‌టీ మాధవులు, పైలెట్ పాషలు తెలిపారు.

జోగుళాంబ సన్నిధిలో మహబూబ్‌నగర్ కలెక్టర్



జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తి పీఠలలో ఐదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శనివారం ఉదయం మహబుబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రవినాయక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బాలబ్రహ్మేశ్వర స్వామికి ఏకవార రుద్రభిషేకం, అమ్మవారికి శ్రీ చక్రఅర్చనలు నిర్వహించారు. క్షేత్ర ప్రాసస్త్యాన్ని ముఖ్యఅర్చకుడు ఆనంద్‌శర్మ వివరించి వేద ఆశీర్వచనం చేశారు.

ఆలయంలో విద్యుత్ శాఖ ఫైనాన్స్ డైరెక్టర్

తెలంగాణ విద్యుత్ శాఖ ఫైనాన్స్ డైరెక్టర్ నరసింహరావు కుటుంబసమేతంగా ఆలయాలను దర్శించుకున్నారు. అదేవిధంగా గుంతకల్ రైల్వే డివిజినల్ మెనేజర్ వెంకటరమణరెడ్డి కుటుంబ సమేతంగా ఆలయాలను దర్శించుకున్నారు. వీరంత ఉభయ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- రూపుదిద్దుకుంటున్న ఆర్చ్‌లు
- స్టేడియం వరకు బీటీ రోడ్డు



స్టేడియం గేటు వద్ద కొనసాగుతున్న మరో ఆర్చ్ నిర్మాణం



ప్రధాన ఆర్చ్ నుంచి మెయిన్ స్టేడియంకు వెళ్లే దారి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో శరవేగంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయి. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులూ ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే మైదానంలో బాస్కెట్‌బాల్, ఆర్చరీ జోన్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో, హైజంప్, లాంగ్‌జంప్ కోర్టులు ఏర్పాటు చేశారు. స్విమ్మింగ్ పూల్ నుంచి డీఎస్‌ఏ కార్యాలయం వరకు సీసీ రోడ్డు వేశారు.

ప్రధాన స్టేడియానికి వెళ్లే దారిలో ఆకర్షణీయంగా రెండు ఆర్చ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. రహదారి నుంచి స్టేడియంకు వెళ్లే చోట ప్రధాన ఆర్చ్ పనులు చివరి దశలో ఉంది. దాదాపు రూ.25లక్షల నిధులతో ఈ ప్రధాన ఆర్చ్ పనులు చేపట్టారు. అదే విధంగా స్టేడియానికి వెళ్లే గేటు వద్ద రూ.12 లక్షలతో మరో ఆర్చ్ ఏర్పాటు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రధాన ఆర్చ్ నుంచి స్టేడియం గేటు వరకు బీటీ రోడ్డు వేశారు. ఇరువైపుల టైల్స్‌వేసి తీర్చిదిద్దారు.